పుస్తకాలు పక్కదారి...!

మదనపల్లె సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు మే నెల చివరి వారంలో ఆయా మండల కేంద్రాల స్టాక్ పాయింట్‌లకు తరలించారు. గోదాంలో పుస్తకాలు నిల్వ చేసి పాఠశాలలకు పంపిణీ చేపట్టింది. అయితే ఇందులో నుంచి భారీ ఎత్తున పాఠ్యపుస్తకాలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మదనపల్లె నియోజకవర్గం పరిధిలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో 275 పాఠశాలలు ఉండగా 21,810 మంది విద్యార్థులున్నారు. ఇప్పటి వరకు 1,31,995 పుస్తకాలు వచ్చాయి. మదనపల్లెకు సంబంధించి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓ గదిలో పుస్తకాలను నిల్వ ఉంచారు. ఇక్కడ నుంచి


జెడ్పీహెచ్ఎస్ గోదాంలోని టెక్ట్స్ బుక్స్

ఆయా పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేస్తారు. గోదాం నుంచి పుస్తకాలు రహస్యంగా బయటకు తరలించినట్లు తెలుస్తోంది. ఈ పుస్తకాలను కొందరు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, బుక్ సెంటర్లకు విక్రయించినట్లు సమాచారం. పుస్తకాలపై ఉన్న ప్రభుత్వ లోగోపై స్టిక్కర్లు అతికించి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిసింది. ఇందులో పని చేసే వారే పాఠ్యపుస్తకాలను బయటకు పంపించినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం విద్యాశాఖ స్టాక్‌పాయింట్ నుంచి వచ్చిన పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేసినట్లు నివేదికలు ఇచ్చారు. అయితే పలు పాఠశాలలో విద్యార్థులకు ఇప్పటి వరకు చాలా మందికి పాఠ్యపుస్తకాలు అందలేదు. ప్రతి ఏటా ఇక్కడ నుంచి పుస్తకాలు బయటకు తరలుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం పాఠ్యపుస్తకాలు అందని పాఠశాలల నివేదికలు పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

విచారణ చేస్తా

పాఠ్యపుస్తకాలు పక్కదారిపట్టిన విషయంపై విచారణ చేస్తా. ఇప్పటికే పుస్తకాల విషయంపై తన దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల గోదామును పరిశీలించాను. గోదాముకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, పాఠశాలలకు పంపిణీ చేసిన పుస్తకాలను పరిశీలిస్తాను. ఇందులో ఎవరైన బయట వ్యక్తులకు అమ్మినట్లు విచారణలో తేలితే చర్యలు తీసుకుంటాం. **-శ్రీరాం పురుషోత్తం, డీవైఈఓ**

డయేరియాపై విస్తృతంగా అవగాహన

పెద్దతిప్పసముద్రం: డయేరియాను సమూలంగా నిర్మూలించేందుకు వైద్య సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు కందుకూరు పీహెచ్‌సీ డాక్టర్ శంకర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి జూలై నెలాఖరు వరకు డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఐదేళ్లలోపు వయసు ఉన్న పిల్లలకు ఓఆర్ఎస్ పంపిణీతో పాటు జింక్ మాత్రల ఆవశ్యకతను వివరిస్తామన్నారు. పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభతతో పాటు తల్లి పాల ఆవశ్యకతను క్షుణంగా తెలియజేస్తామన్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖ అధికారుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామ పంచాయతీ అధికారుల చొరవతో తాగునీటి పైపుల లీకేజీ, తాగు నీరు కలుషితం కాకుండా జాగ్రతలు చేపడతామని డాక్టర్ శంకర్ వివరించారు.

క్లుప్తంగా

స్క్వాయ్ మార్షల్ ఆర్ట్సలో ప్రతిభ

మదనపల్లె సిటీ: కశ్మీర్ పహల్గాంలో నిర్వహించిన 17వ అంతర్జాతీయ స్క్వాయ్ మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరంలో జిల్లా నుంచి మదనపల్లెకు చెందిన మాస్టర్ ఖాదర్‌బాషా పాల్గొని ప్రతిభను కనబరిచారు. 6వ బ్లాక్‌బెల్ట్ నుంచి 7వ బ్లాక్‌బెల్ట్‌కి అర్హత సాధించారు. అదే విధంగా మాజ్జార్ అలీ బ్లాక్‌బెల్ట్ 1వ డాన్‌కు సాధించారు. ఈ శిక్షణలో వివిధ దేశాల నుంచి మాస్టర్లు పాల్గొన్నారు. వీరిని స్క్వాయ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గ్రాండ్ మాస్టర్ మీర్ నజీర్ అహ్మద్, కోశాధికారి మజహర్‌ఖాన్‌ల చేతుల మీదుగా మాస్టర్ డిగ్రీ7 డాన్ ప్రశంసా ప్రతాన్ని అందుకున్నారు.

వికసించిన బ్రహ్మకమలం



మదనపల్లె సిటీ: స్థానిక దొంతవీధిలోని విశ్రాంత ఉపాధ్యాయుడు జీవీ ప్రసాద్ ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. సుమారు ఎనిమిదిపైగా పూలు పూశాయి. పూలు చూసేందుకు పలువురు ఆసక్తి కనబరిచారు.

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

వాల్మీకిపురం: బలిజల ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక మదనపల్లి రోడ్డులోని విశ్రాంత ఏఎస్ఐ శంకరయ్య కార్యాలయంలో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజలు రాయలసీమ ప్రాంతంలో అత్యంత వెనుకబడి ఉన్నారని, పేరుకు సంఖ్యాబలం ఉన్న అటు ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదలకు నోచుకోలేదని తెలిపారు. బలిజలు ఐకమత్యంగా ఉండి ఒకరికి ఒకరు పరస్పర సహకారం చేసుకుంటూ వెళ్తేనే అన్ని రంగాల్లో బలిజలు ముందడు వేయగలమని చెప్పారు. కార్యక్రమంలో టమేట రామచంద్ర, శంకరయ్య, బొక్కసం రామక్రిష్ణ, ఆనంద, శేఖర్, వెంకటరమణ, వంశి, శ్రీనివాసులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం


హెచ్‌ఎం కంచి పెద్దరెడ్డెప్ప దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దమండ్యం: మండలంలోని యల్లంవారిపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచి పెద్దిరెడ్డెప్పను సహచర ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణంలో ఆదివారం పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అతిథులు విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. 36 సంవత్సరాల పాటు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. ఉన్నత స్థానాలను పొందిన విద్యార్థులు ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ బాలికల వసతిగృహంలో సిబ్బంది కొరత

కేవీపల్లె : స్థానిక బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలో సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వసతి గృహంలో వార్డెన్ సంధ్య తోపాటు కామాటి దీపారాణి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వంటమనిషి, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. వార్డెన్ పీలేరు నుంచి అప్పుడప్పుడు వచ్చి వెలుతుండడంతో కామాటి దీపారాణి ఒక్కటే మొత్తం పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్టల్‌లో సుమారు 70 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగ చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువ జామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మదనపల్లెకు హరిత హారం

ప్రతి ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శ్రీకారం

మదనపల్లె : హరిత మదనపల్లె లక్ష్యంగా ప్రతి ఆదివారం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చెప్పారు. పేదవాడి ఊటీగా పేరుపొందిన మదనపల్లెలో పర్యావరణాన్ని, ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందించేందుకు 50,000 మొక్కలు నాటేందుకు నిర్ణయించామన్నారు. అందులో భాగంగా ప్రతి ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం జరపాలని, ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటుచేసుకున్నామన్నారు. ఆదివారం పట్టణంలోని బీకే.పల్లె కాలనీ, చౌడేశ్వరినగర్, గొల్లపల్లె బైపాస్‌రోడ్డు తదితర ఏరియాల్లో మొక్కలు నాటి నీళ్లుపోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చెట్లను పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణ జరగడమే కాకుండా, మానవ మనుగడ ప్రమాదంలో పడకుండా ఉంటుందన్నారు. భావితరాలకు బంగారు భవిష్యత్తును కానుకగా ఇచ్చినట్లు ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత మున్సిపల్ అధికారులు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు నాదెళ్లవిద్యాసాగర్, బాలుస్వామి, గిరిరాయల్, జి.వి.నాయుడు, బాబ్జీ, భావన, సంగం శ్రీనివాసులు, ఏఈ బండపల్లిశిరీషా పాల్గొన్నారు.


మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

మదనపల్లె : పట్టణంలోని చిత్తూరుబస్టాండ్ కూడలిలో మరాఠసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూమిపూజ నిర్వహించారు. అనంతరం బొంతలసత్రంలో నిర్వహించిన మరాఠా సంఘం కుటుంబసభ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తుల బాటలో యువత పయనించాలని, నేటి యువతరానికి ఛత్రపతి ఆదర్శమని, ఆయన మార్గంలో నడవాలన్నారు. పట్టణంలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠకు సహకరించాల్సిందిగా మరాఠాసంఘం నాయకులు తనను కోరినప్పుడు ఎమ్మెల్యే అయిన వందరోజుల్లోపు విగ్రహ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చానన్నారు. అందులో భాగంగానే భూమిపూజ చేయడం జరిగిందని, విగ్రహ ఆవిష్కరణ రోజున మరాఠా సంఘానికి పది కుంటల భూమిని కేటాయిస్తూ పట్టా ఇస్తానన్నారు. శివాజీ మహారాజ్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తానన్నారు. శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట భూమిపూజ తన చేతుల మీదుగా జరగడం గొప్పవరంగా భావిస్తున్నానన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి న్యాయం

కలకడ : ఉపాధ్యాయ వృత్తికి సుధాకర్ న్యాయం చేశాడని ఎంఈఓలు మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కదిరాయచెర్వు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుర్ర సుధాకర పదవీ విరమణ సందర్భంగా వారి దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. యూటీఎఫ్ నాయకులు రాధాక్రిష్ణ, అక్రంబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం

మదనపల్లె : మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్, ఎఫ్-100 నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షులుగా ఎస్.నందగోపాల్, జనరల్ సెక్రటరీగా జె.భాస్కరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.కృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సుధాకరరెడ్డి, రామసుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, శివమల్లప్పనాయుడు, యం.కె.మునిరత్నం, యం.భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా కే.రవిచంద్ర, అడ్వైజర్‌గా వి.సదాశివరెడ్డి ఎంపికయ్యారు. శనివారం సాయంత్రం తిరుపతిలో డీసీఎల్‌ను కలిసి నూతన కార్యవర్గాన్ని ఆమోదించాల్సిందిగా కోరామన్నారు. వర్కర్స్ సమస్యలు నూతన కార్యవర్గం పరిష్కరిస్తుందని జనరల్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం

వాల్మీకిపురం: సమాజంలోని నిరుపేద ప్రజలను ఆదుకునేందుకే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవతా సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. సంవత్సర కాలంలో 240సార్లు ఫ్రీజర్ బాక్సులు, 137 సార్లు శాంతిరథం, 64 సార్లు అంబులెన్స్ సర్వీసు ప్రజలకు అందించడం జరిగిందన్నారు. అనంతరం సంస్థ అభివృద్ధి కోసం కలసికట్టుగా పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కేశవ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, నీళ్లభాస్కర్, రమణమూర్తి, సివి రమణ, శంకర, రాజారెడ్డి, లక్ష్మినారాయణ శెట్టి, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

మహిళల ఆరోగ్య పరిరక్షణకు సహకారం

అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్ చైర్మన్ నిత్యానందరెడ్డి

కేవీపల్లె : మహిళల ఆరోగ్య పరిరక్షణ వైద్య శిబిరాలకు తనవంతు సహకారం ఉంటుందని అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్ చైర్మన్ నిత్యానందరెడ్డి అన్నారు. ఆదివారం కేవీపల్లెలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటుబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ×సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ వైద్యశిబిరం॰ నిర్వహించారు. ప్రత్యేకంగా వైద్యశిబిరాల కోసం రూపొందించిన మెడికల్ వ్యాన్‌ను, అనంతరం వైద్యశిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆరోగ్య పరిరక్షణ, గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం రూపకల్పన చేసిన వైద్యశిబిరాల కార్యక్రమంలో తమను భాగస్వామ్యం చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా 23 సంవత్సరాలుగా వివిధ సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ మహిళల్లో కన్పిస్తున్న గర్భాశయ ముఖ ద్వారపు క్యాన్సర్ నివారణకోసమే సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేవీపల్లె, కలికిరి, కలకడ మండలాల్లో 18 నెలల పాటు ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి. బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ కేవీపల్లెలో నిర్వహించిన వైద్యశిబిరంలో 50 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 100 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చెన్నై విజయ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఉషారెడ్డి, మెడిగో హాస్పిటల్స్ ఆర్థో పెడిషన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జి.జె.రెడ్డి, డాక్టర్ సజిత్, శశికుమార్‌రెడ్డి, ప్రవీణ్, వేణురెడ్డి, శ్రీనివాసులు, ఆదినారాయణ, షబ్బీర్ పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నిత్యానందరెడ్డి

వినయంతో ఉన్నత శిఖరాలు

కురబలకోట: వినయ విధేయతలతో ఉన్నత శిఖరాలు చేరవచ్చని బైబిల్ చెబుతోందని అంగళ్లులోని సీయోను చర్చి ప్రధాన పాస్టర్ డాక్టర్ విక్టర్ వేదనాయకమ్ పేర్కొన్నారు. ఆదివారం చర్చిలో జరిగిన ఆరాధన, బల్ల వర్తమానంలో ఆయన వాక్యోపదేశం చేస్తూ ఒక దేశం నుంచి మరో దేశానికి చెరగా కొనిపోబడి ఆపై తల్లిదండ్రులు లేని అనాధ యువతి ఎస్తేరు అన్నారు. ఇలాంటి ఆమె సువిశాల పర్షియన్ సామ్రాజ్య చక్రవర్తి అహశ్వరోషు రాణిగా మారిందన్నారు. ఇది ఎస్తేరు జీవితంలో జరిగిన అసాధారణమైన గొప్ప కార్యమన్నారు. అనాధ యువతి గొప్ప సామ్రాజ్య చక్రవర్తికి రాణి కావడమంటే ఊహకు కూడా అందనిదన్నారు. ఆమెలోని వినయ విధేయతలతోనే ఇది సాధ్యమైందన్నారు. దీనికి తోడు ఆమె వెనుక దేవుని కృప కీలకంగా పనిచేసిందన్నారు. లోబడి జీవించడం ఆమెకు చిన్ననాటి నుండి అలవాటుగా మారిందన్నారు. అదే ఆమె ఉన్నత శిఖరాలు చేరడానికి దోహపడిందన్నారు. విలువ లేని వాటికి విలువనిచ్చి నిలబెట్టడం దేవునికే సాధ్యమన్నారు. పరిస్థితులను మారుస్తాడన్నారు. ప్రతికూలాన్ని కూడా అనుకూలంగా మారుస్తాడన్నారు. అందం ఆకర్షణ కన్నా వినయ విధేయతలు గొప్పవని బైబిల్ చెబుతోందన్నారు.


దైవ సందేశం ఇస్తున్న విక్టర్ వేదనాయకమ్